www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 29 జూన్ 2025

5

పశ్చిమ గోదావరి



తణుకులో రోటరీ పీస్ టవర్ ఏర్పాటు

తణుకు : ప్రపంచ దేశాల్లో అశాంతి నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల మధ్య శాంతి నెలకొల్పేందుకు ఆయా దేశాలకు సంబంధించి స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. తణుకు పట్టణంలోని నరేంద్ర సెంటర్ వద్ద రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ పీస్ టవర్ ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో అనేక దేశాల్లో ఉగ్రవాదుల దాడులు, విచ్ఛిన్నకర శక్తులు సృష్టిస్తున్న అలజడుల నేపథ్యంలో యుద్ధ వాతావరణం నెలకొందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పీస్ టవర్లు ఏర్పాటు చేసి ప్రపంచ శాంతిని వర్ధిల్లాలి అనే ఉద్దేశ్యంతో ప్రజల మధ్య, రాష్ట్రాలు, దేశాల మధ్య శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఆనందం మస్తాన్ రావు(బాబీ), కె.సిద్ధార్థ, గమిని రాంబాబు పాల్గొన్నారు.

కలెక్టర్‌గారూ..పట్టించుకోరా..!



బదిలీల కౌన్సెలింగ్‌కు వచ్చిన పంచాయతీ రాజ్‌శాఖ ఉద్యోగులు

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సచివాలయ ఉద్యోగుల బదిలీలు

వికలాంగులు, స్పౌజ్ ఉద్యోగులకు అమలు కాని సడలింపులు

ఎంఎల్‌ఎ సిఫార్సు లేకపోతే ఏదీ వర్తించదని హుకుం

పంచాయతీరాజ్‌శాఖ అధికారుల తీరు మరింత వివాదాస్పదం

భార్యాభర్తలను విడదీస్తున్న ఎంఎల్‌ఎల లేఖలు

సిఫార్సు లేఖల ఆధారంగా జాబితాలు ముందే తయారు చేసి కౌన్సెలింగ్ పేరుతో మాయ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలను ఆయా శాఖల ఉన్నతాధికారులు ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు సైతం పాటించకుండా పైరవీలకు ప్రాధాన్యత ఇస్తూ వికలాంగులు, స్పౌజ్ కేటగిరీ ఉద్యోగుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్న పరిస్థితి ఉంది. దీంతో కలెక్టర్‌గారూ.. మీరైనా పట్టించుకుని, నిబంధనలు అమలయ్యేలా చూడాలని సచివాలయ ఉద్యోగులు వేడుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1100కుపైగా గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా, దాదాపు 8,500 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఐదేళ్ల పూర్తి చేసుకున్న ఉద్యోగులందరికీ బదిలీ తప్పనిసరి చేయడమే కాకుండా, రిక్వెస్ట్ బదిలీలకు సైతం ప్రభుత్వం అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వికలాంగులు, స్పౌజ్ (భార్య, భర్త ఉద్యోగులైతే దగ్గర్లో బదిలీ చేసేలా) కేటగిరి వారికి మొదటి అవకాశం కల్పించడం వంటి నిబంధనలను ఉత్తర్వుల్లో పేర్కొంది. సచివాలయ ఉద్యోగుల బదిలీల వ్యవహారం చూస్తున్న ఆయా శాఖల జిల్లా అధికారులు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ముందుకు సాగుతున్నారు. శుక్రవారం పంచాయతీ శాఖకు సంబంధించిన ఉద్యోగులను ఏలూరు పిలిపించి ఆప్షన్ ఫారాలను తీసుకున్నారు. శనివారం సర్వే, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖలకు చెందిన ఉద్యోగులంతా ఏలూరు వచ్చి ఆయా శాఖల కార్యాలయాల్లో ఆప్షన్ ఫారాలు ఇచ్చి వెళ్లారు. వాస్తవానికి ఉద్యోగులను ఏలూరు పిలిపించి కౌన్సెలింగ్ పేరుతో చేస్తున్న హడావుడి అంతా వట్టి బూటకమని శనివారం తేలిపోయింది. ఎంఎల్‌ఎల సిఫార్సు లేఖల ఆధారంగా బదిలీల జాబితా ఇప్పటికే అధికారులు తయారు చేసేశారనే చర్చ ఉద్యోగుల్లో నడుస్తోంది. ఎంఎల్‌ఎ సిఫార్సు లేఖ లేకపోతే ఆప్షన్ ఫారంలో పేర్కొన్న మూడు స్థానాల్లో ఏఒక్క స్థానమూ ఇవ్వడం సాధ్యంకాదని అధికారులు నేరుగా చెబుతున్న పరిస్థితి ఉంది. పంచాయతీరాజ్‌శాఖలో ఈ పరిస్థితి అత్యంత దారుణంగా ఉందనే విమర్శలు విన్పిస్తున్నాయి. స్పౌజ్, వికలాంగుల కేటగిరీలో ఉన్న ఉద్యోగులను సైతం ఎంఎల్‌ఎ సిఫార్సు లేక లేదంటూ ఆప్షన్సగా పెట్టిన స్థానాలను తిరస్కరించిన పరిస్థితి ఆ శాఖలో యథేచ్ఛగా సాగింది. ఎంఎల్‌ఎల సిఫార్సు లేఖల పేరుతో భార్యాభర్తలను విడదీయడమే కాకుండా, వికలాంగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న పరిస్థితి ఉంది. ఎంఎల్‌ఎ సిఫార్సు లేఖ ఇవ్వకుంటే ఆప్షన్ ఫారంలో పేర్కొన్న ఏఒక్కస్థానం ఇవ్వడం కుదరదని ఆయా శాఖల జిల్లా అధికారులు చెబుతున్న తీరు అత్యంత దారుణంగా మారింది. ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఎంఎల్‌ఎ సిఫార్సు లేఖలు ఉండాలని ఎక్కడైనా ఉందా అనేది అధికారులే చెప్పాలి. వికలాంగులు, స్పౌజ్ కేటగిరి ఉన్న ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వకుండా సిఫార్సు లేఖలు అడగడం చూస్తే బదిలీల వ్యవహారం ఎంత అడ్డగోలుగా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. నిబంధనలు పాటించకుండా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలు జరుగుతున్నా అడిగే నాథుడే లేకుండాపోయాడు.

బదిలీలపై కలెక్టర్ జోక్యం చేసుకోవాలని చర్చ

సచివాలయ ఉద్యోగుల బదిలీల వ్యవహారంలో ఆయా శాఖల అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై కలెక్టర్ జోక్యం చేసుకుని నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిబంధనలకు పూర్తిగా తిలోదకాలు ఇచ్చేశారనే విమర్శలు విన్పిస్తున్నాయి. స్పౌజ్, వికలాంగుల కేటగిరీలకు సడలింపులను సైతం సరిగా అమలు చేయకపోవడంపై పలువురు ఉద్యోగులు కోర్టును ఆశ్రయించే ఆలోచన సైతం చేస్తున్నారు. బదిలీల్లో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై కలెక్టర్ జోక్యం చేసుకుని స్పౌజ్, వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు, నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సహకరించాలి

డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు



నాయకులతో మాట్లాడుతున్న డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - భీమవరం

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక కలెక్టరేట్లో వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా కొత్త ఓటర్ల నమోద, తొలగింపు వంటివి చేపడతారని, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారి పేర్లను శాశ్వతంగా తొలగించడం, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పు తప్పులను సరిదిద్దడం వంటివి తమ దృష్టికి తీసుకురావాలని వివరించారు. పోలింగ్ స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు, ఇతర సమస్యలు ఏమున్నా తెలపాలని కోరారు. జిల్లాలో 18-19 ఏళ్ల మధ్య వయస్సు గల ఓటర్లు 19,974 మంది, 20-29 ఏళ్ల వయస్సు గల వారు 2,51,672 మంది, 30-39 మధ్య వయస్సు గలవారు 3,70,354 మంది, 40-49 మధ్య వయస్సు గల వారు 3,30,902 మంది, 50-59 మధ్య వయస్సు గలవారు 2,47,260 మంది, 60-69 మధ్య వయస్సు గల వారు 1,54,548 మంది, 70-79 మధ్య వయస్సు గలవారు 70,769 మంది, 80 ఆపై వయస్సు ఉన్నవారు 24,659 మంది ఉన్నారన్నారు. వీరిలో పురుషులు 7,20,684 మంది, స్త్రీలు 7,50,377 మంది, థర్డ్ జెండర్స్ 77 మంది మొత్తం జిల్లాలో ఓటర్లు 14,71,138 మంది ఉన్నారని వివరించారు. సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ మద్రాపు సన్యాసిరావు, కాంగ్రెస్ ప్రతినిధి టి.వంశీ శ్రీనివాసరెడ్డి, జనసేన ప్రతినిధి బి.జయశివ, బిఎస్‌పి ప్రతినిధి ఎం.రత్నరాజు పాల్గొన్నారు.

నేడు చించినాడలో అమరవీరుల స్మారక సభ


పాల్గొనున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర, జిల్లా నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి

చించినాడలో ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు అమరవీరుల 75వ వర్ధంతి సభ జరగనుంది. ఈ సభలో ముఖ్యవక్తగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతోపాటు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, ఏలూరు పశ్చిమగోదావరి జిల్లాల కార్యదర్శులు ఎ.రవి, జెఎన్‌వి.గోపాలన్, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, సీనియర్ నాయకులు కేతా సూర్యారావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, జిల్లెల్ల ప్రశాంతి, సిపిఎం నేత బాతిరెడ్డి జార్జి తదితరులు పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ సభలో కార్యకర్తలు, సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ నేతలు కోరారు.

ఎంఆర్.రాజు పేరుతో సైన్స్ పార్క్ ఏర్పాటు చేయాలి

చినమయ్యప్రభ రోటరీ క్లబ్ ఛైర్మన్ బోండా వెంకట సుబ్బారావు



పత్రాన్ని చూపుతున్న బోండా వెంకట సుబ్బారావు

ప్రజాశక్తి - కాళ్ల

భీమవరంలో ఎంఆర్.రాజు పేరుతో సైన్స్ పార్క్ ఏర్పాటు చేయాలని భీమవరం చినమయ్యప్రభ రోటరీ క్లబ్ ఛైర్మన్ బోండా వెంకట సుబ్బారావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పెదఅమిరంలో ఎంఆర్.రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం పరిసర ప్రాంతాల్లో గ్రామీణ ప్రజలకు ఎంజిఎం ట్రస్ట్ ద్వారా ఎంఆర్.రాజు పెదఅమిరంలో సుమారు 30 ఏళ్ల పాటు ఉచిత వైద్య సేవలందించారన్నారు. రాజమండ్రిలో జ్ఞానానంద పేరుతో, ఏలూరులో జిఎంసి బాలయోగి పేరుతో సైన్స్ పార్కులు ఏర్పాటు చేశారు. ఆ తరహాలో జిల్లాలోని భీమవరంలో ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఉన్న పలు కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఎంఆర్.రాజు పేరుతో సైన్స్ పార్క్ ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్.రాజు కుమారులు రామ్ కుమార్ రాజు, రంగరాజు, మనవడు వెంకటపతిరాజు, సాయి, అరేటి ప్రకాష్, డిఎన్‌ఆర్ కళాశాల జాయింట్ కార్యదర్శి బోసు రాజు పాల్గొన్నారు.

సిఇఒకు పట్టదా..!

జెడ్‌పి ఆవరణలో ఉద్యోగ సంఘానికి కేటాయించిన స్థలంలో వ్యాపార కార్యకలాపాలకు ఏర్పాట్లు

నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నా పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో?

కలెక్టర్ జోక్యం చేసుకుంటేనే ప్రజల సొమ్ముకు రక్ష



భవనం కింది అతస్తులో వ్యాపార కార్యకలాపాలకు చేస్తున్న పనులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'జిల్లా పరిషత్ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నా సిఇఒ ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారా.. జెడ్‌పిలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న పనులను సైతం ఆయన చూసీచూడనట్లు వదిలేస్తున్నారా' అంటే అవుననే సమాధానం వస్తోంది. జిల్లా పరిషత్ ఆవరణలో కలెక్టరేట్‌కు వెళ్లే రహదారి పక్కగా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘానికి గతంలో 125 గజాలు స్థలం కేటాయించారు. ఆ స్థలంలో నిర్మించిన భవనంలో వ్యాపార కార్యకలాపాలు సాగించాలని ప్రయత్నించడం ఆది నుంచి వివాదాస్పదమైంది. ప్రభుత్వం ఉచితంగా కేటాయించిన స్థలంలో వ్యాపార కార్యకలాపాలు సాగించడం చట్ట విరుద్ధం. దీనిపై గతంలో పని చేసిన కలెక్టర్ ముత్యాలరాజు స్థలాన్ని వెనక్కి తీసుకునేలా ఆదేశాలు సైతం జారీ చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులు ఎన్నో ప్రయత్నాల అనంతరం, అప్పటి కలెక్టర్ కార్తికేయమిశ్రా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించబోమని ప్రమాణపత్రం రాయించుకుని తిరిగి భవనం కేటాయించారు. మళ్లీ నిబంధనలు తుంగలో తొక్కుతూ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల భవనంలో వ్యాపార కార్యకలాపాలకు అనుమతిస్తూ జిల్లా పరిషత్ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. దీనిపై పత్రికల్లో కథనాలొచ్చినా జెడ్‌పి అధికారుల్లో ఏమాత్రం చలనం లేకుండాపోయింది. శనివారం సదరు ఉద్యోగ సంఘ భవనం కింది అంతస్తులో వ్యాపార కార్యకలాపాలకు అనుగుణంగా మార్పులు చేసే పనులు కొనసాగాయి. జిల్లా పరిషత్ సిఇఒ శ్రీహరి దృష్టికి విషయం వెళ్లిన తర్వాత కూడా ఈ విధంగా పనులు జరుగుతున్న తీరు చూస్తే అంతా కుమ్మక్కయ్యారా అనే అనుమానాలు నెలకొన్నాయి. జెడ్‌పి ఆస్తులను కాపాడాల్సిన అధికారులే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం ఏమిటో ఏఒక్కరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని తగు చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. జిల్లా పరిషత్ అధికారులు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని కోరుతున్నారు.

నమ్మించి ముంచేశాడు..!

చిట్టీల పేరుతో రూ.5 కోట్లకు టోకరా

లబోదిబోమంటున్న బాధితులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పరిచయస్తుడు కావడం.. ప్రతిఒక్కరినీ ఆత్మీయంగా ఏదోక వరుస పెట్టి పిలవడంతో మన వాడేగా అని నమ్మి వారంతా చిట్టీలు కట్టారు. అయితే ఆ నమ్మకాన్ని వమ్ము చేసి రూ.5 కోట్లకుపైగా జనానికి టోకరా వేసి పరారయ్యాడు. ఇదీ పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం తోకతిప్పలో శనివారం వెలుగుచూసిన ఘటన.

తోకతిప్ప గ్రామానికి చెందిన పొన్నాడ వీరవెంకటరమణ కొంతకాలంగా చిట్టీల వ్యాపారం చేస్తున్నాడు. దీంతో గ్రామానికి చెందిన రోజువారీ కూలీలు, గ్రామస్తులు అతని వద్ద నెలవారీ చిట్టీలు వేశారు. పాట సమయంలో పాడుకున్నా అదిగో ఇస్తాను.. ఇదిగో ఇస్తాను అంటూ కాలయాపన చేశాడుగాని పైసా ఇవ్వలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. పైగా పాడిన సొమ్ముకు వడ్డీ ఇస్తానంటూ ఒక చీటీ మీద రాసిచ్చినట్లు బాధితులు వాపోతున్నారు. అక్కడితో ఆగకుండా ఈ ఘరానా మోసగాడు డ్వాక్రా మహిళలకు రుణాలు వచ్చినప్పుడు మీకు అవసరం వచ్చినప్పుడు ఇస్తాను.. డబ్బులు ఖర్చు చేసుకోవద్దు, నేను మంచి వడ్డీ ఇస్తానంటూ తీసుకునేవాడని చెబుతున్నారు. రమణ కేవలం తోకతప్పలోనే కాదు భీమవరం మండలంలో పలు గ్రామాలతోపాటు, మొగల్తూరు మండలం, కృష్ణా జిల్లా కృతివెన్ను మండలాల్లో పలువురి దగ్గర ఈ విధంగా సొమ్ములు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల సొమ్ము కోసం వెంకటరమణపై ఒత్తిడి పెరగడంతో తోకతిప్పలోని ఇంటిని ఖాళీ చేసి పరారయ్యాడు. దీంతో బాధితులంతా లబోదిబోమంటూ శనివారం భీమవరం రూరల్ పోలీసులను ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలంటూ స్టేషన్ వద్ద కొద్దిసేపు నినదించారు. అనంతరం రూరల్ ఎస్‌ఐ వీర్రాజుకు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై ఎస్‌ఐ వీర్రాజు మాట్లాడుతూ ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటానని చెప్పారు. వెంకటరమణ ఎక్కడున్నా వెతికి తీసుకొస్తామన్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణరావు



మాట్లాడుతున్న రమణారావు

ప్రజాశక్తి - భీమవరం

కార్మికులకు, దేశ ప్రయోజనాలకు నష్టం కల్గిస్తున్న మోడీ విధానాలకు వ్యతిరేకంగా జులై 9న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణరావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం సంఘం జిల్లా కమిటీ సమావేశం ఎర్రంశెట్టి చినసుబ్బరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి రమణరావు మాట్లాడుతూ వందేళ్లకుపైగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తెచ్చారన్నారు. పని గంటలు ఎనిమిది నుంచి పది, 12 గంటలకు పెంచడం ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును గత ప్రభుత్వం నిర్వీర్యం చేయగా, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదైనా ఇచ్చిన హామీని అమలు చేయలేదని విమర్శించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, నాయకులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టాలను అమలు కాకపోవడం వల్ల వేల సంఖ్యలో క్లెయిములు పెండింగ్లో పడిపోయాయన్నారు. ప్రభుత్వానికి ఒక్క పైసా ఖర్చు లేకుండా భవన నిర్మాణ కార్మికుల సొమ్ము వారికి ఖర్చు పెట్టడానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మండా సూరిబాబు కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

కొనసాగిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె



తాడేపల్లిగూడెంలో వినతిని అందజేస్తున్న జెఎసి నాయకులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సంక్షేమ పథకాలు అమలుచేయాలని, టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ఆరవ రోజు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జెఎసి నాయకులు మరిపూడి సతీష్ కుమార్ మాట్లాడుతూ తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలని గత ఆరు రోజులుగా శాంతియుతంగా సమ్మె నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఏవిధమైన సమాచారం రాకపోవడంతో శనివారం రాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా స్ట్రీట్ లైట్లు నిలిపివేస్తున్నట్లు, అలాగే సోమవారం నుంచి వాటర్ సప్లై నిధులు నిర్వహిస్తున్న కార్మికులు కూడా పూర్తిస్థాయిలో సమ్మెలో పాల్గొంటామని తెలిపారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోరుతూ తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, మున్సిపల్ ఇంజనీర్‌లకు వినతి పత్రం అందజేసినట్లు సతీష్ తెలిపారు. ఎప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల సోమవారం నుంచి సమ్మెను మరింత ఉధృతం చేస్తామని జెఎసి నాయకులు సతీష్ తెలిపారు.

నరసాపురం : మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్లో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమసమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన ఆందోళన ఆరవ రోజుకి చేరింది. శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద రిలేదీక్షల్లో కూర్చుని నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్యను కలిశారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జెఎసి నాయకులు మాట్లాడుతూ శనివారం నుంచి వీధిలైట్ల నిర్వహణ పూర్తిగా బహిష్కరిస్తున్నామన్నారు. ఈనెల 29 అర్ధ రాత్రి నుంచి మంచినీటి సరఫరా విధులు కూడా బహిష్కరించి సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. పదేళ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులను రెగ్యులైజ్ చేయాలని, హెచ్‌ఆర్‌సి పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎవరికి వారు యమునా తీరే..!

ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు.. ఏదైనా తీరని నష్టం వాటిల్లినప్పుడు పెద్దలు వెళ్లి పలుకరించి ధైర్యం చెప్పి రావడం మానవ సహజ లక్షణాల్లో ఒకటి. తద్వారా ఆ కష్టం తీరకపోయినా.. నష్టం భర్తీ కాకపోయినా తమ వెంట ఈ సమాజం ఉందనే భరోసా కల్పించడమే దీని వెనుక ఉన్న ముఖ్యోద్దేశం. అయితే జిల్లాలోని పాలకులకు, అధికారులకు మాత్రం ఈ సంగతి పట్టకపోవడం చర్చనీయాంశమైంది.

ఏలూరు శాయ్ హాస్టల్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారిణులు ఉంటూ వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతున్నారు. అక్కడి బాలికలపై కోచ్ లైంగిక వేధింపులకు పాల్పడటంతోపాటు అసభ్యకరంగా ప్రవర్తించాడని ఫిర్యాదు నేరుగా శాయ్ ప్రధాన కార్యాలయానికి చేరడంతో అక్కడి నుంచి ఒక బృందం రంగంలోకి దిగి రహస్యంగా విచారణ సాగించి వేధింపులు వాస్తవమేనని తేల్చి, పోలీసులకు ఫిర్యాదు చేసే వరకూ బాహ్య ప్రపంచానికి విషయం తెలియరాలేదు. ఆపై ఆరోపణలు వచ్చిన కోచ్‌పై శాయ్ కూడా చర్యలు చేపట్టింది. అలాగే పోలీసులు సైతం కీచక కోచ్‌ను అరెస్టు చేసి కటకటాల వెనుకకు పంపారు. ఇంతవరకూ బాగానే ఉంది. వేరే రాష్ట్రాల నుంచి ఇక్కడకొచ్చి మన దేశ ప్రతిష్టను అంతర్జాతీయస్థాయిలో చాటేందుకు శిక్షణ పొందుతున్న బాలికలపై కనురెప్పలా కాపాడాల్సిన కోచ్‌నే అమానుషంగా ప్రవర్తించడం వారి మానసిక స్థయిర్యాన్ని దెబ్బతీసి ఉండొచ్చు. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని ముఖ్య ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఆ ప్రాంగణాన్ని సందర్శించి ఆ బాలికలకు ధైర్యం చెప్పాల్సిన అవసరం ఉంది. ఇంకా వారి సమస్యలు ఏమిటో తెలుసుకోవాల్సిన బాధ్యత కూడా ఉంది. అయితే ఇవేమీ మన జిల్లా పాలకులకు పట్టకపోవడం శోచనీయం. జిల్లా రథసారథులుగా మహిళలే కీలక బాధ్యతల్లో ఉన్నారు. ఇటు జెడ్‌పి ఛైర్‌పర్సన్, అటు కలెక్టర్, జెసి అత్యంత ముఖ్యులే. వీరు బాధిత బాలికలను కలిసి ధైర్యం చెప్పడంతోపాటు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆ ప్రాంగణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించి ఉంటే బాగుండేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. జిల్లా పర్యటనకు విచ్చేసిన పిసిసి అధ్యక్షురాలు షర్మిల సైతం ఈ ఘటనపై స్పందించకపోవడం గమనార్హం. అయితే ప్రచార కార్యక్రమాల్లో ముందుండే పాలకుల్లానే అధికారుల తీరూ తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కలెక్టరేట్ల వద్ద అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, వివిధ తరగతుల ప్రజానీకం తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన చేపట్టారు. ప్రధానంగా చిరుద్యోగులకు సంక్షేమ పథకాల అమలు కోరుతూ ఆందోళనలు సాగుతున్నాయి. దీనిపై ప్రభుత్వం నోరుమెదపడం లేదు. పైగా భీమవరంలో అంగన్వాడీల ఆందోళనను సైతం అడ్డుకునేందుకు పోలీసులు యత్నించడం గమనార్హం. ధర్నాను సైతం అడ్డుకునే ప్రయత్నం చేయడం బట్టి కూటమి పాలకులు సైతం వైసిపి పాలకుల్లానే వ్యవహరిస్తున్నారనే చర్చ సాగుతోంది.

ఇక పాలకులు మారినా విద్యావిధానాలు మారకపోవడంతో ఇటు విద్యార్థులకు, అటు విద్యార్థుల తల్లిదండ్రులకు తిప్పలు తప్పడం లేదు. రేషన్‌లైజేషన్ పేరిట తరగతుల తరలింపు గ్రామాల్లో పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ముదినేపల్లి మండలం కోడూరు యుపి పాఠశాలను కొనసాగించాలని 20 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన సాగిస్తున్నా కనీసం జిల్లా అధికారులు స్పందించిన దాఖలాల్లేవు. పశ్చిమగోదావరి జిల్లాలో పెనుమంట్ర మండలంలో పెనుమంట్ర ఎల్‌ఇ, సూర్యారావుపేట, మార్టేరులోని శివరావుపేట స్కూళ్ల అంశంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇష్టానుసారం తరగతుల తరలింపు వల్ల తమ పిల్లలు సదూర ప్రాంతం వెళ్లలేరని తల్లిదండ్రులు మొత్తుకుంటున్నా విద్యాశాఖాధికారుల్లో కదలిక లేని పరిస్థితి. కనీసం జిల్లా అధికారులు సైతం కనీసం నోరు మెదపని పరిస్థితి.

ఇక మండవల్లిలోని తరుగుమూలలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించిన భూముల్లో పోలీసు స్టేషన్ భవన నిర్మాణం వివాదాస్పదమవుతోంది. కామన్‌సైట్‌లో కేవలం ప్రజోపయోగకరమైన కమ్యూనిటీ హాళ్లు వంటివి మాత్రమే నిర్మాణం చేపట్టాలి. దానికి భిన్నంగా పోలీసు స్టేషన్ భవన నిర్మాణం చర్చనీయాంశమైంది. తహశీల్దార్ కార్యాలయం పక్కనే పోలీసు స్టేషన్ భవన నిర్మాణానికి అవకాశం ఉన్నా ఇక్కడే పనులు చేపట్టడంపై ప్రజల్లో అనేక అనుమానాలు నెలకొన్నాయి. దీనికితోడు ఆ భూములను మెరక చేస్తే తాము ఇళ్లు కట్టుకుంటామని ఏళ్ల తరబడి లబ్ధిదారులు కోరుతున్నా పట్టించుకోని ప్రభుత్వం పోలీసు స్టేషన్ నిర్మాణానికి మాత్రం రెండు రోజుల్లో పూడిక చేపట్టడం గమనార్హం. అంటే పాలకులకు పేదల బాగోగుల పట్ల ఏపాటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకుని అక్కడి లబ్ధిదారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సి ఉంది. అయితే పాలకుల తరహాలోనే జిల్లా అధికారులు సైతం అధికార దర్పం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి.

ఏదేమైనా వరుస ఘటనల్లో పాలకుల వలె జిల్లా అధికారుల్లోనూ కనీస స్పందన కరువైందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ విమర్శలను తిప్పికొట్టేలా జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

-వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వచ్చేనా..!

కానరాని నాయకత్వం.. జాడలేని కార్యకర్తలు

నేడు పిసిసి అధ్యక్షురాలు షర్మిల జిల్లా పర్యటన



ప్రజాశక్తి - భీమవరం

ఒకప్పుడు జిల్లా రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగిన కాంగ్రెస్ పార్టీ నేడు నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతోంది. నియోజకవర్గాల్లో పట్టుమని పది మంది నేతలు, కార్యకర్తలు లేకుండాపోయారు. ఈ క్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల తొలిసారి జిల్లాకు ఆదివారం వస్తున్నారు. కొన ఊపిరితో ఉన్న కాంగ్రెస్‌కు ఆమె జీవం పోస్తారా అని ఆ పార్టీ శ్రేణులు ఆశగా ఎదురుచూస్తున్నాయి.

దశాబ్దాలపాటు జిల్లా కాంగ్రెస్ కంచుకోటగా నిలిచింది. 2014 ఎన్నికలకు ముందు రాష్ట్ర విభజన నిర్ణయం జిల్లాలో ఆ పార్టీని చావుదెబ్బ తీసింది. కాంగ్రెస్ పార్టీలో ఉన్న నేతలంతా వైసిపిలో చేరారు. అతికొద్ది మంది నేతలే కాంగ్రెస్‌లో మిగిలారు. ఇప్పటికి పన్నెండు సంవత్సరాలవుతున్నా ఆ దెబ్బనుంచి ఇప్పటికీ కోలుకోలేకుండా పోయింది. దేశంలో మతోన్మాద శక్తులు ముందుకు వస్తున్న వేళ కాంగ్రెస్ బలపడాలని అనేక మంది ఆశ పడుతున్నారు. అయితే జిల్లాలో కాంగ్రెస్ నేతలు అడపాదడపా తప్ప ప్రజా సమస్యలపై పని చేస్తున్న సందర్భాలు తక్కువే. దీనికితోడు జిల్లా కేంద్రమైన భీమవరంలో కాంగ్రెస్ పార్టీలో రెండు గ్రూపులు ఏర్పడ్డాయి. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరి కుమార్‌రాజు కార్యకర్తలను కలుపుకుని ముందుకు సాగుతూ, వామపక్షాలు చేపట్టే ప్రతి కార్యక్రమానికి సంఘీభావం తెలుపడంతోపాటు ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. మరోగ్రూపు కేవలం పార్టీ సమావేశాలతో సరిపెడుతున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి.

నేడు భీమవరంలో షర్మిల పర్యటన

జిల్లాలో పార్టీ బలోపేతానికి ఎలాంటి కార్యాచరణ లేదని ఆ పార్టీ నేతలే చెబుతున్న సందర్భంలో పిసిసి అధ్యక్షురాలు షర్మిల జిల్లా కేంద్రమైన భీమవరంలో ఆదివారం పర్యటించనున్నారు. స్థానిక ఆనంద ఇన్ హోటల్లో నిర్వహించనున్న సర్వసభ్య సమావేశంలో ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో షర్మిల పర్యటన జిల్లాలో ప్రత్యేకత సంతరించుకుంది.



అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ కృష్ణమోహన్


తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి - ఆచంట

గ్రామపంచాయతీలు చెత్త నుంచి సంపాదన సమకూర్చుకునే అదనపు ఆదాయం సమకూర్చుకోవడం ద్వారా గ్రామాలు బలోపేతం అవుతాయని ఎంపిడిఒ బిఎస్ఎ కృష్ణమోహన్ అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం తడి, పొడి చెత్త సేకరణ, వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీ క్లీన్ విలేజ్‌పై ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్, పంచాయతీ సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పంచాయతీ హరిత రాయబారులు ఏవిధంగా గృహాలనుంచి చెత్తను సేకరించాలి అనే విషయంపై అవగాహన కల్పించారు. ఈ ప్రక్రియపై వచ్చే ఐవిఆర్ఎస్ కాల్‌కు ప్రజలు ఏ విధంగా స్పందించాలనే విషయంపై మాట్లాడారు. చెత్త నుంచి సంపద తయారీ వంటి అంశాలపై విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నరసింహ రావు, జానకి, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఏలూరుపాడు టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక

కాళ్ల : ఏలూరుపాడు గ్రామ నూతన కార్యవర్గం ఎంపిక శనివారం నిర్వహించారు. గ్రామ అధ్యక్షునిగా మంతెన ఆంజనేయరాజు, ఉపాధ్యక్షునిగా వర్కపల్లి హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా కనగల సత్యనారాయణ, ట్రెజరర్ ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా సుబ్రహ్మణ్యం వంశీ, ప్రభాకర్, కృష్ణంరాజు, ఏడుకొండలు, నిరీష్, శేఖర్, వి.సుబ్బారావు, సామి, దుర్గారావు, కృష్ణ, భాస్కర్, నరేశ్వర్లు పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులు

రెండో విడత అడ్మిషన్లు ప్రారంభం

ఉండి : ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో 2025-26 సంవత్సరానికి గాను రెండో విడత అడ్మిషన్లు ప్రారంభించినట్లు కన్వీనర్ వేగేశ్న ప్రసాదరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణులు అయిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో రెండో విడత అడ్మిషన్లకు జూలై 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు హాజరై వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9676099998కు సంప్రదించాలని ఆయన కోరారు. ఐటిఐ పాసైన విద్యార్థులకు అప్రెంటిస్ షిప్ పూర్తిచేసినట్లయితే పలు కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, తమ కాలేజీలలో జరిగే జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగాలు సంపాదించుకునే అవకాశం ఉంటుందని వారు వివరించారు. విద్యార్థులు బంగారు భవిష్యత్తుకు మంచి బాట ఏర్పరుచుకోవాలని సూచించారు. పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఒక సంవత్సరం వెల్డర్ కోర్సు ఉందని, వెల్డర్ కోర్స్ నేర్చుకోవాలని ఆసక్తి ఉన్నవారు కూడా తమ కళాశాలను సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పూర్తయిన కల్వర్ట్, వంతెన పనులు

మార్టేరు-పెనుగొండ మీదుగా వాహనాల పరుగులు

పెనుమంట్ర : దాదాపు రెండు నెలల కాలం పాటు మూతపడ్డ మార్టేరు-పెనుగొండ రోడ్డులో శనివారం ఉదయం నుంచి బస్సు, లారీ, చిన్న కారు వంటి వాహనాలు పరుగులు పెడుతున్నాయి. మండలంలోని మార్టేరు సమీపంలో ఉన్న నెగ్గిపూడి కెనాల్ కల్వర్ట్ నిర్మాణం, పెనుగొండ పెద్ద వంతెన రోడ్డు పనులు పూర్తి అయిన నేపథ్యంలో అన్ని రకాల వాహనాలకు ఆర్అండ్‌బి దారి వదిలింది. ఇప్పటి వరకు భీమవరం, రావులపాలెం వైపు వెళ్లే వాహనాలు మార్టేరు సెంటర్ మీదుగా ఆచంట సిద్ధాంతం వైపు, విజయవాడ, నిడదవోలు, తణుకు వైపు వెళ్లే వాహనాలు మార్టేరు మీదుగా ఆలమూరు, జగన్నపేట వైపు దారి మళ్లించడంతో ప్రయాణికులు, వాహన డ్రైవర్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ప్రారంభమైన వాహనాల రాకపోకలు

పేరంటాలమ్మ ఆలయం వద్ద బహిరంగ వేలం

ఉండి : వేలం పాటలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించినట్లు పేరంటాలమ్మ ఆలయ ఇన్‌ఛార్జి, కార్యనిర్వహణ అధికారి తోట శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వెలివర్రు గ్రామదేవత శ్రీ పేరంటాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద శనివారం ఆలయ అధికారులు 2025-26 సంవత్సరానికి గాను వీరలు జాతెల్లు, షామియానా, కొబ్బరి చిప్పలు, కొబ్బరి చెక్కలు, అమ్మవారి ఆలయం వద్ద దుకాణం వంటి వాటికి బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌ఛార్జి, కార్యనిర్వహణ అధికారి తోట శ్రీను మాట్లాడుతూ అమ్మవారికి ప్రధాన ఆదాయ వనరులుగా ఉన్న వీరలు, జాతెల్లుకు ఉండి శ్రీనివాస వర్మ రూ.1.90 లక్షలకు దక్కించుకున్నారని, దుకాణాలను వెలివర్రు గ్రామానికి చెందిన కురివర్రు శ్రీనివాస్ రూ.2.76 లక్షలకు దక్కించుకున్నారని, కొబ్బరి చిప్పలు వెలివర్రు గ్రామానికి చెందిన నల్లూరు చంద్రశేఖర్ రూ.7,500 లకు, కొబ్బరి చెక్కలను బొక్కా రెడ్డియ్య రూ.3 లక్షలకు దక్కించుకున్నారని చెప్పారు. ఈ బహిరంగ వేలాన్ని ఆలయ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ వేలం పాటలో ఆలయ ఛైర్మన్ గాదిరాజు వెంకటరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు, ఆలయ మాజీ ఛైర్మన్లు ముదునూరి వీర్రాజు, ఎంపిటిసి రంగరాజు, మాజీ సభ్యులు కుడుపూడి నాగరాజు ఉన్నారు.

ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట : ఎంఎల్ఎ

తణుకు : ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామస్థాయిలో చర్యలు చేపట్టాలని సూచించారు. అత్తిలి మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం మండలంలోని వైద్య ఆరోగ్య శాఖతోపాటు పంచాయతీరాజ్, పారిశుద్ధ్య సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభావాన్ని తగ్గించి పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా అందరినీ సమన్వయం చేసుకొని క్షేత్రస్థాయిలో ప్రజారోగ్యాన్ని కాపాడే విధంగా అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. మండల పరిషత్ అధ్యక్షులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భూ యజమానులు మత్స్యశాఖాధికారులను సంప్రదించాలి

ఉండి : నాన్ ఆక్వా జోన్‌లో ఆక్వా సాగు చేపట్టాలనుకునే భూ యజమానులు మత్స్యశాఖ అధికారులను సంప్రదించాలని ఆ శాఖ అధికారులు సూచించారు. భూమి యజమానులు తమ భూమి సర్వే నెంబర్లతో దరఖాస్తు చేసుకోవాలని, గ్రామ సర్పంచి, విఆర్ఒ, మత్స్యశాఖ అధికారుల ద్వారా అనుమతులు పొందాలని తెలిపారు. గ్రామ సర్పంచి, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

చేసిన పనులకు బిల్లులివ్వాలి

గొల్లలకోడేరు సర్పంచి లక్ష్మి, ఉపసర్పంచి శ్రీనివాస వర్మ

పాలకోడేరు : గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు ఇవ్వాలని గొల్లలకోడేరు సర్పంచి కుక్కల లక్ష్మి, ఉప సర్పంచి కలిదిండి శ్రీనివాస వర్మ ప్రభుత్వాన్ని కోరారు. పాలకోడేరులో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. స్థానిక పంచాయతీ సాధారణ నిధులతో గ్రామంలో సిసి రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామని, బిల్లులు మంజూరు కాలేదని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. కాంట్రాక్టర్లు అప్పులు చేసి పనులు పూర్తి చేశారని, బిల్లులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ రోడ్లపై నిధులు చెల్లించకపోతే పనులు ఆగిపోతాయని, అధికారులు తక్షణమే స్పందించి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోతే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

కాయగూరల ధరలకు రెక్కలు!

ప్రజాశక్తి - పాలకొల్లు



ఇంతవరకు అన్ని తరగతుల ప్రజలకు అందుబాటులో ఉన్న కాయగూరల ధరలకు రెక్కలొచ్చాయి. సాధారణంగా మే నెల ఎండల ప్రభావంతో జూన్ నెలలోనే కాయగూరల ఉత్పత్తి తగ్గి ధరలు పెరుగుతాయి. అయితే ఈ ఏడాది మే, జూన్ నెలల్లో అడపాదడపా వర్షాలు పడటంతో కాయగూరల ధరలు పెరుగుదల లేదు. అయితే ఇప్పుడు వరుస వర్షాలకు మొక్కలు మునిగిపోవడం, లేక ఎండలకు ఎండిపోవడంతో ఉత్పత్తి తగ్గి ధరలు పెరుగుతున్నాయి. దొండ, బెండ, బీర, క్యారెట్, బీట్‌రూట్, వంకాయ కిలో రూ.50 లోపులోనే అందుబాటులో ఉండగా శనివారం కిలో రూ.60 నుంచి 80కు పెరిగాయి. టమోటాలు కిలో రూ.20 నుంచి 30కు పెరిగాయి. మునగకాడ పెద్దది ఒకటి రూ.20 ఉండగా చిన్నది రూ.10 ఉంది. ఈ ధరలు జూలై నెలలో ఇంకా పెరుతాయని చెబుతున్నారు. జూలై నెలలో వర్షాలు, వరదలపై ధరలు ఆధారపడి ఉంటాయి.

అశోక్ కుటుంబానికి పరామర్శ

నరసాపురం : ఇటీవల సూర్యపేట జిల్లా కోదాడ మండలంలో దుర్గాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆలమూరు ఎస్ఐ ముద్దాల అశోక్ కుటుంబ సభ్యుల్ని శనివారం ఏలూరు రేంజ్ ఐజి జివిజి అశోక్ పరామర్శించారు. పట్టణంలోని రుస్తుంబాద ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆశోక్ ఇంటికి వెళ్లారు. ముందుగా అశోక్ చిత్రపటానికి పూలమాలలు వేసి సెల్యూట్ కొట్టి నివాళులర్పించారు. అనంతరం అశోక్ భార్య, కుమారులు, సోదరులను పరామర్శించారు. కుటుంబ పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం ఆశోక్ భార్యతో మాట్లాడారు. పిల్లల చదువులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో చనిపోయినందున్న ప్రభుత్వపరంగా వచ్చే పరిహారం, ఇన్స్యూరెన్స్, ఇతర సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని ఆమెకు సూచించారు. ఆయన వెంట అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు, సిఐలు బి.యాదగిరి, జి.దుర్గాప్రసాద్, ఎస్ఐలు సిహెచ్.జయలక్ష్మి, టి.వెంకట సురేష్, వై.నాగలక్ష్మి, జి.వాసులు ఉన్నారు.

ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని వినియోగించుకోవాలి

ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఛైర్మన్ ఎస్.శ్రీదేవి

నరసాపురం : జైల్ ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి, ఛైర్మన్ ఎస్.శ్రీదేవి తెలిపారు. శనివారం నరసాపురం ఉప కారాగారాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్న వారికి అందించే వైద్య సదుపాయాలు ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. శిక్షపడిన ముద్దాయిలు కూడా ఉచిత న్యాయ సహాయం పొంది అప్పీల్‌కి వెళ్లే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, నర్సాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి, ఉప కారాగారం పర్యవేక్షణాధికారి టి.అప్పారావు, జైల్ సిబ్బంది, ప్యానల్ న్యాయవాదులు చిట్టి పద్మజ, సిహెచ్.వెంకటేశ్వరరావు, పిఎల్‌వి.ప్రతిభ రాజీ పాల్గొన్నారు.

మండల వ్యవసాయాధికారిగా దేవీస్వరూప



పెనుమంట్ర : మండల వ్యవసాయ అధికారిగా బి.దేవీస్వరూప నియమితులయ్యారు. ఈనెల ప్రారంభంలో ఇక్కడ రెండేళ్లకు పైగా పనిచేసిన అడబాల జ్యోషిలా బదిలీపై నరసాపురం వెళ్లగా, భీమవరం రూరల్ మండలం వ్యవసాయ విస్తరణ అధికారి(విఇఒ)గా పనిచేసిన దేవీ స్వరూప మండల వ్యవసాయ అధికారిగా ఉద్యోగోన్నతి పొంది శనివారం ఇక్కడ విధుల్లో చేరారు. ఆమెను వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు అభినందించారు. మండలంలోని వ్యవసాయ శాఖ ద్వారా వ్యవసాయానికి, రైతులకు సేవలు అందేలా విధులు నిర్వహిస్తానని ఆమె పేర్కొన్నారు.

ఆపన్నులకు అండగా సిఎం సహాయ నిధి : ఎంఎల్ఎ

భీమవరం టౌన్ : ఆపదలో ఉన్నవారిని ఆదుకొనేందుకు సిఎం సహాయ నిధి ఎంతగానో దోహదపడుతోందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో భీమవరం నియోజకవర్గంలోని 32 మంది లబ్ధిదారులకు రూ.23,32,573 చెక్కులను ఆయన అందించి మాట్లాడారు. సిఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని, వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలని, పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సిఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు పాల్గొన్నారు.

నీట మునిగిన రైల్వే అండర్ బ్రిడ్జి

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

భీమవరం : స్థానిక బుధవారం మార్కెట్ రైల్వే అండర్ బ్రిడ్జి మోకాళ్ల లోతు వర్షపు నీటితో నిండిపోయి రెండు రోజులు కావస్తున్నా మున్సిపల్ అధికారులు కనీసం పట్టించుకోకపోవడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన చేశారు. మోకాళ్ల లోతు నీటితో ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు, కాలి బాటన నడిచేవాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షానికే అండర్ బ్రిడ్జ వర్షపు నీటితో నిండిపోతున్నా.. మున్సిపల్ అధికారులు కనీస చర్యలు తీసుకోవట్లేదని విమర్శించారు. తరచూ ఇవే ఇబ్బందులు ఉత్పన్నమవుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆంతర్యం ఏమిటో అర్థం కావట్లేదని పేర్కొన్నారు.

వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన

తాడేపల్లిగూడెం : ఒక్క చాన్స్ ఇచ్చిన ప్రజలపై ఐదేళ్లపాటు ఉక్కుపాదం మోపి, ఒక చేత్తో సంక్షేమ బటన్లు నొక్కుతూ, మరో చేత్తో రాష్ట్రాన్ని విచ్చలవిడిగా దోపిడీ చేసిన ఘనుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని రాష్ట్ర విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ఘాటుగా విమర్శించారు. శనివారం మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించబోయే వాటర్ ట్యాంక్‌నకు ఆయన శంకుస్థాపన చేశారు. పెంటపాడులో 8 గ్రామాలు, మండలంలో రెండు గ్రామాలు వెరసి 10 గ్రామాలలో వాటర్ ట్యాంకుల నిర్మాణాలను శంకుస్థాపన చేసి అతి త్వరలో పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, భవనాలు, ఇతర కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జి, తాడేపల్లిగూడెం భారతీయ జనతా పార్టీ ఇన్‌ఛార్జి ఈతకోట తాతాజీ, జనసేన మండల అధ్యక్షులు అడప ప్రసాద్, పెంటపాడు మండల అధ్యక్షులు పుల్లా బాబి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి : ఎంఎల్ఎ

మొగల్తూరు : మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని రామన్నపాలెం పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం హస్తకళల అభివృద్ధి, కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో అపిటికో లిమిటెడ్ హైదరాబాద్ వారిచే నిర్వహించబడిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రామన్నపాలెం గ్రామానికి చెందిన 50 మంది ఎస్‌సి లేసు హస్త కళాకారులకు, పేరుపాలెం, కొత్తట, కాళీపట్నం, కేపీ పాలెం లేసు హస్త కళాకారులు 60 మందికి ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని అన్నారు. సర్పంచి బందెల ఎలిశా, పిడి సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు పోరాడుదాం

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఆచంట

కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు పోరాడుతామని, జులై 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సూర్నేడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో నేలపూడి విజయలక్ష్మి అధ్యక్షతన సిఐటియు మండల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లందరికీ కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ మాట్లాడుతూ ఒకవైపు కార్పొరేట్లకు వేల కోట్లు రుణాలు మాఫీ చేస్తూనే మరోవైపు పేదలపై చిన్న, మధ్య తరహా పరిశ్రమల యజమానులపై విద్యుత్ యూజర్ సభ్యులు జిఎస్‌టి పన్నులు వేయడంతో వేలాది పరిశ్రమలు మూతపడ్డాయని, ఫలితంగా కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మిక హక్కుల కోసం జూలై 9వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెను పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోపరేటివ్ జిల్లా అధ్యక్షులు, సిఐటియు జిల్లా నాయకులు పారుపల్లి ఏసురత్నం, సిఐటియు నాయకులు పి.మోహన్ రావు, కుసుమే జయరాజు, నక్క శైలజ, సిహెచ్.సూర్యకుమారి, ఎ.సత్యవతి, కె.నాగలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, ఎన్.దుర్గ భవాని పాల్గొన్నారు.

వీరవాసరం : ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, పని ఒత్తిడి తగ్గించాలని, జూలై 9న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశ వర్కర్లందరూ పాల్గొనాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ఆశ వర్కర్స్ యూనియన్ వీరవాసరం మండల విస్తృతస్థాయి సమావేశం వీరవాసరం యుటిఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ నాయకులు డి.వరలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడారు. సమావేశంలో బేబీ, సంతోష్ వాణి, దుర్గ ఉన్నారు.

మొగల్తూరు : కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే నెల 9వ తేదీన చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం మొగల్తూరులో అంగన్వాడీలు కరపత్రాలతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు జి.పెద్దింట్లు, ఎ.సీతారత్నం, కె.కామాక్షి, పి.లక్ష్మీ మంగామణి, పి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

కల్లుగీత కుటుంబాలను ఆదుకోవాలి

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి

తణుకు : అక్రమ బెల్ట్ షాపులు తక్షణం తొలగించి, కల్లుగీత కుటుంబాలను ఆదుకోవాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అమరవీరుల భవనంలో సంఘ జిల్లా కమిటీ సమావేశం కామన మునిస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నరసింహామూర్తి మాట్లాడుతూ అనేక ఔషధ గుణాలు ఉన్న ఆహారం లాంటి ప్రకృతి సిద్ధమైన తాటికల్లుపై ప్రభుత్వం కక్షకట్టి అక్రమ మద్యం, ఊరువాడ పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు పెట్టించి కల్లు అమ్మకాలు లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. నిత్యం గ్రామాల్లో కలకలలాడే కల్లుగీత కుటుంబాలను టిడిపి కూటమి ప్రభుత్వం కన్నీరు పెట్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ గీతవృత్తిని అన్ని విధాల ఆదుకుంటున్నాయని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వం మాత్రం గీత వృత్తిపై కక్షగట్టి పొమ్మనకుండా పొగ పెడుతోందని విమర్శించారు. అనంతరం సంఘ జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గీత కార్మికుల జీవితాలు మారతాయని ఆశించారని, కాని గత ప్రభుత్వమే మంచిదన్నట్లు నేడు ఉందన్నారు. మన వృత్తిని మనమే కాపాడుకోవాలి, రండి జూలై 14వ తేదీన మన బాధలు కలెక్టర్‌కి చెప్పుకుందాం.. భీమవరం తరలిరండి అని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి బొక్క చంటి, జిల్లా ఉపాధ్యక్షులు కడలి పాండు, మామిడిశెట్టి నాగభూషణం పాల్గొన్నారు.

విచారణతోనే వాస్తవాలు బట్టబయలు

డ్వాక్రా ఎపిఎం నాగజ్యోతి



ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని నంద మూరుగరువు డ్వాక్రా సంఘాల సొమ్ములు దుర్వినియోగం జరిగిన వ్యవహారమంతా ఉన్నతాధికారుల విచారణ అనంతరం వాస్తవాలేంటో తెలుస్తాయని ఎపిఎం నాగజ్యోతి శనివారం విలేకర్లకు తెలిపారు. డ్వాక్రా సంఘాలకు చెందిన సొమ్ములు ఏ విధంగా దుర్వినియోగం జరిగాయో అమె వివరించారు. దుర్వినియోగం జరిగిన సమాచారం గ్రూపు సభ్యులు, అధికారులకంటే ముందుగా నందమూరుగరువు గ్రామానికి చెందిన ఒక ప్రయివేటు వ్యక్తికి తెలియడంతో బహిర్గతమైందన్నారు. సదరు ప్రయివేటు వ్యక్తి ఈ వ్యవహారమంతా తనకు అనుకూలంగా మలుచుకుని తాను చేసిన తప్పిదాన్ని తప్పించుకునే క్రమంలో తనపై బురదచల్లడానికి ప్రయత్నిస్తున్నట్టు ఎపిఎం తెలిపింది. 2022 నుంచి నిధులు దుర్వినియోగం జరుగుతున్నట్టు గుర్తించామన్నారు. అప్పటి నుంచి మూడు సంవత్సరాలు ఆడిట్ పూర్తియిందని, ఏ ఆడిట్‌లోను నిధులు దుర్వినియోగం జరిగినట్టు ఎందుకు బహిర్గతం కాలేదని ఆమె ప్రశ్నిస్తున్నారు. తాను వీరవాసరం బాధ్యతలు చేపట్టి ఆరు నెలల కాలం కావస్తుందని, ఇంకా ఆడిట్ జరగలేదని, నిధులు దుర్వినియోగంలో నా పాత్ర ఉందనడానికి ఏ ఆధారంతో ఆరోపణలు చేస్తున్నారో తెలియడం లేదన్నారు. విఒఎలు బోడపాటి సత్యవాణి, పోతుల నాగస్వాతిలు నిధులు దుర్వినియోగంలో ప్రధాన పాత్రదారులుగా ఉన్నారన్నారు. ఇదిలా ఉంటే పొదుపు ఖాతాల నుంచి సభ్యులు సంతకాలను ఫోర్జరీ చేసి ఇతర ఖాతాలకు మళ్లిస్తుంటే బ్యాంకు అధికారులు ఏం చేస్తున్నారని ఎపిఎం అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిధుల దుర్వినియోగంలో బ్యాంకు అధికారుల పాత్రపైనా విచారణ చేయాలని ఎపిఎం అన్నారు. వీరవాసరం ఇండియన్ బ్యాంకులో రెండు సంవత్సరాలుగా ఒకే వ్యక్తి మేనేజర్‌గా పనిచేస్తున్న సమయంలోనే ఈ దుర్వినియోగం జరిగిందని మేనేజర్ పాత్రపై ఎపిఎం అనుమానం వ్యక్తం చేసింది. బ్యాంకులో ఉన్న డ్వాక్రా నిధులు గ్రూపులకు సంబంధలేని వ్యక్తులకు ట్రాన్స్‌ఫర్ అవుతుంటే బ్యాంకు అధికారులు ఏం చేస్తున్నారంటూ ఎపిఎం ప్రశ్నిస్తున్నారు. బ్యాంకు పరిధిలో ఐదు వందల గ్రూపులుండగా కేవలం రెండు గ్రూపులలోనే నిధులు దుర్వినియోగం జరుగుతుంటే బ్యాంకు అధికారులు గుర్తింలేదా అన్నారు. నిధులు దుర్వినియోగం విషయం సభ్యులకు తెలియకుండా బ్యాంకు అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా గోప్యత పాటించినట్టు తెలుస్తుందన్నారు. నిధులు దుర్వినియోగం పాల్పడిన వారిపై ఇప్పటికే తీసుకోవలసిన చర్యలు తీసుకున్నానన్నారు. విఒఎ సత్యవాణి, నాగస్వాతిలు తమ తప్పును ఒప్పుకుని సదరు ప్రయివేటు వ్యక్తి వారి నుంచి ఎంత మేరకు సొమ్ములు తీసుకున్నారో గ్రామ పెద్దల సమక్షంలో రాతపూర్వకంగా రాసి ఇవ్వడం జరిగిందని ఎపిఎం తెలిపారు.


ధాన్యం బకాయిలు చెల్లించండి

రైతు సంఘం నాయకులు

పెంటపాడు : కూటమి ప్రభుత్వం ఎన్నికలలో రైతు పండించిన ప్రతి ధాన్యం గింజ మేమే కొనుగోలు చేస్తామని ప్రకటించి నేడు మాట తప్పిందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి అన్నారు. ప్రజాసంఘాల కార్యాలయం వద్ద రైతు సంఘం మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, నాయకులు బంకురు నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మే తొమ్మిదో తేదీ వరకు రైతు బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ చేశారని, మే పదో తేదీ నుంచి తోలిన ధాన్యానికి ఒక్క రూపాయి కూడా రైతు బ్యాంక్ ఖాతాలో జమ కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ డిపార్ట్మెంటు, వ్యవసాయాధికారులు ముందస్తుగా వ్యవసాయ పనులు మొదలు పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని, రైతుల సొమ్ము ప్రభుత్వం దగ్గర ఉందని, విత్తనాలు కొనాలన్నా, దమ్ము ట్రాక్టర్‌కి డబ్బులు ఇవ్వాలన్నా, ఎరువులు, పురుగు మందులు కొనాలన్నా రైతు చేతిలో డబ్బులు లేక రైతు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. వెంటనే ప్రభుత్వం రైతులకి రావలసిన ధాన్యం సొమ్ము రైతు బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే రైతు అప్పుల ఊబిలో కూరుకుపోయారని, వ్యవసాయం లాభసాటిగా లేక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, ఆత్మహత్యలు నివారించాలంటే స్వామినాథం కమిటీ సిఫార్సులు అమలు చేయాలని ప్రభుత్వాన్ని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరక వెంకటరావు, మాదాసు శ్రీను, గాది సుబ్బయ్య, వీరాబత్తుల దానయ్య, పెనగంటి దుర్గ, వీరాబత్తుల పుల్లారావు, ఆకుమూరి శ్రీను, సుబ్బయ్య పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్



చెక్ అందుకుంటున్న విద్యార్థిని

మండలంలోని లంకల కోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదవ తరగతిలో 500 మార్కులకుపైబడిన విద్యార్థులకు, మిగిలిన తరగతుల మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులను ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ద్వారా పూర్వ విద్యార్థి ఎంఆర్‌కె.రాజు, సుశీల దంపతుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని, దానివల్ల మీ కుటుంబసభ్యులకే కాకుండా గ్రామానికి, దేశానికి మంచిపేరు ప్రతిష్టలు తెచ్చి సేవ చేసిన వారు అవుతారని తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ విధిగా మూడు మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. పదవ తరగతిలో 583 మార్కులు సాధించి పాలకొల్లు మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన బిశెట్టి వైశాలిని అలీషా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయలు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, అప్పలరాజు, ఎస్ఎంసి ఛైర్మన్ ఇర్రింకి రామకృష్ణ, కోఆప్షన్ సభ్యులు టి.వెంకటేశ్వరరావు, ఎస్ఎంసి వైస్ ఛైర్మన్ ఉషారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు లయన్స్ క్లబ్ మండలాధ్యక్షునిగా శిడగం సతీష్ ప్రమాణ స్వీకారం

పాలకొల్లు : పాలకొల్లు లయన్స్ క్లబ్‌కి నూతన అధ్యక్షుడిగా శిడగం సతీష్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. ఆదివారం పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాల్లో వైభవంగా జరిగే కార్యక్రమంలో వీరి టీం ప్రమాణ స్వీకారం చేస్తుంది. కార్యదర్శిగా సత్యనారాయణ ప్రసాద్, కోశాధికారిగా దేవరపు వరప్రసాద్ ప్రమాణస్వీకారం చేస్తారు. పాలకొల్లు నుంచి ఎన్‌విఎస్ఎస్.పాపారావు నాయుడు, లయన్స్ ఇంటర్నేషనల్ గవర్నర్‌గా ఈవారంలో అమెరికాలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన గవర్నర్ హోదాలో సొంత పాలకొల్లు లయన్స్ ప్రమాణ స్వీకారంకు హాజరుకానున్నారు. అమెరికాలో ప్రపంచంలోని 200 మంది లయన్స్ గవర్నర్లు ఇటీవల ప్రమాణస్వీకారం చేశారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు

పాలకొల్లు రూరల్ : పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పలు రూరల్ గ్రామాలలో సహాయ కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఉండడానికి సొంత ఇల్లు లేని దొడ్డిపట్ల వాస్తవ్యులు చెల్లబోయిన పల్లారావుకు ఇల్లు కోసం షెడ్ వేసుకొనేల రూ.18 వేలు విలువ గలిగిన ఐరన్ రేకులు అందజేశారు. ఉల్లంపర్రు గ్రామంలో ప్రజలు సౌకర్యార్థం గ్రామదేవత వేగులమ్మ గుడి వద్ద, రేషన్ షాప్ వద్ద, రైతులకు విశ్రాంతి తీసుకునేలా పొలం గట్టు మీద సిమెంట్ బెంచిలు వేశారు. లాగ్ జంప్‌లో 10 నేషనల్స్, ఇంటర్నేషనల్స్ ఆడి తన సత్తా చాటిన మన జిల్లా వీరవాసరం అమ్మాయి రావాడ కుసుమ బెంగుళూర్‌లో శిక్షణ పొందుతుంది. ఈ అమ్మాయికి ఆర్థికపరమైన అంశాలు అడ్డంకిగా మారాయి. పాలకొల్లు రోటరీ క్లబ్‌ను సహాయం కోరింది. వెంటనే స్పందించి రోటరీ సభ్యుల సహకారంతో ఆమె కుటుంబ సభ్యులు తల్లి దుర్గ ఆదిలక్ష్మి కు రూ.50 వేలు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జవ్వాజి కళ్యాణ్, ట్రెజరర్ పోతాబత్తుల సత్యనారాయణ, అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, పాస్ట్ ప్రెసిడెంట్‌లు మద్దాల వాసు, మద్దాల రాంప్రసాద్, యిమ్మిడి రాజేష్, కావలి నగేష్, మైగాపుల రాంబాబు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు చేయూత

ఉండి : ఇటీవల మహదేవపట్టణంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో నష్టపోయిన బాధితులు కుడిపూడి పద్మావతి, లంక అమ్మాజీలను శనివారం ఉండి మండల తహశీల్దార్ కావలి నాగార్జున, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి గ్రామ అధ్యక్షులు వనిమా శ్రీనివాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం జరిగిన విద్యుత్ ప్రమాదంలో కుడిపూడి పద్మావతి, లంక అమ్మాజీ తమ ఇంటిలో సుమారు రూ.5 లక్షల 50 వేలు విలువచేసే గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయని నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలోపు ఒక్కో కుటుంబానికి తాము రూ.5 వేల నగదు, 25 కేజీల బియ్యాన్ని అందించడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు ఎస్.చిన్నారావు, ఎస్.శ్రీనివాసరావు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం : సిఐ

పాలకొల్లు : ప్రస్తుతం సమాజంలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని, బాలికలు, మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పాలకొల్లు పట్టణ సిఐ కె.రజనీకుమార్ చెప్పారు. పాలకొల్లు బిఆర్ఎంవి మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో బాలికలు, మహిళలపై జరుగుతున్న నేరాలు - వాటి నియంత్రణ, చట్టాలపై అవగాహన సదస్సుపై ఆయన వివరంగా మాట్లాడారు. బాలికలు ఏది మంచి, ఏది చెడు తెలుసుకోవాలని చెప్పారు. ఏది గుడ్ టచ్, ఏది బ్యాడ్ టచ్ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బాలికలకు సమాజంలో అందరికన్నా మంచి చేసేది వారి తల్లిదండ్రులే అన్నారు. ఈరోజుల్లో అందరి పట్ల జాగ్రత్తలు పాటించాలని సిఐ కోరారు. హైస్కూల్ హెచ్ఎం వై.ప్రభాకర్ శాస్త్రి, ఎఎస్ఐ మార్లింగం పాల్గొన్నారు.

వేండ్రలో ఉపాధ్యాయులకు సత్కారం

పాలకోడేరు: వేండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఇటీవల బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను, బదిలీపై వేరే చోటకు వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. బదిలీపై మరొక పాఠశాలకు వెళ్లిన కెపి.పరదేశిబాబు, వీరవల్లి సూర్యకుమార్, సువర్ణకృప, ఉపాధ్యాయులతో పాటు బదిలీపై పాఠశాలకు విచ్చేసిన జె.శ్రీనివాసరావు, సిహెచ్.రాధ, పంపన సాయిబాబు, ఫణిరాజేష్, విశ్వనాథరాజు, ఎన్.నాగబాబులను సత్కరించారు. హెచ్ఎం జివివి.శ్రీనివాసు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రామచంద్రపురం 13వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

D.O.P. No. 24/2024

Between:

మురా సురేష్ -పిటిషనర్

AND

మురా అనిత, W/o. సురేష్, C/o. మత్తే అమృతరావు, లూథరన్ చర్చ్ దగ్గర, ఎస్.సి.పేట, సీసలి గ్రామం, కాళ్ళ మండలం, పశ్చిమగోదావరి జిల్లా -రెస్పాండెంట్

నోటీసు

పై నెంబరు గల రెస్పాండెంట్ అయిన మీకు ఎన్నిమార్లు కోర్టు నోటీసులు పంపినను మీరు బుద్ధిపూర్వకంగా తీసుకొనుటలేదు. శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం యీ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయుచున్నాము. సదరు పై నెంబరు D.O.P. గ్రంధములో కోర్టు వాయిదా **దీ. 03-07-2025 అయ్యి వున్నది.** కాబట్టి సదరు వాయిదా రోజున మీరు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని **ఉదయం 10 గంటలకు** హాజరు అయి ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని పక్షమున మీపై పరోక్షమందు విచారించి తీర్మానం చేయబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వి.వెంకట్రావు
రామచంద్రపురం పిటిషనర్ తరపు అడ్వకేటు
28-06-25 ఆలమూరు, సెల్: 9989955116